ఎగిరేపళ్లెం

వెంకటేశ్వర్రావూ నేనూ సన్యాసం పుచ్చుకుందామన్న తీర్మానానికి రాక తప్పలేదు ఈ పరిస్థితులదృష్ట్యా. ఒక్కొక్కడికీ కుచేల సంతానమయ్యెను! సంతానోత్పత్తి నిష్పత్తికి సరిపోయినట్టు ఆదాయం పెరగటం లేదు. అంచేత మేమిద్దరం ఎవరికీ చెప్పకంగా సన్యాసం పుచ్చుకుందామని ఆలోచించాము. కాని, ఇదివరకటి మా అన్ని ఆలోచనల్లాగానే ఇదిగూడా నీళ్లుగారిపోయి, ఎందాకా వచ్చిందంటే, ఎలాగో ఒక వారంపాటు ఈ రొదనించి తప్పించుకుందామని అనుకున్నాం. నవ్వకండి. మరేం చెయ్యడం? వెంకటేశ్వర్రావు కుటుంబభారాన్ని వాడితమ్ముడినెత్తిన వేసి బయల్దేరాడు. నేను మా ఆవిడకే అప్పజెప్పి బయలుదేరాను.

ఇద్దరం నిజాంపట్నం సముద్రతీరం విశాలంగానూ ఖాళీగానూ వుంటుందని అక్కడికి వెళ్లాం. ఆవేళ నిండుపౌర్ణమి. మేము ఆవూరుచేరి అక్కడ మా బంధువు లొకరింట్లో దిట్టంగా (సన్యాసం పుచ్చుకునేవాళ్ళ లక్షణాలేనా ఇవి?) భోంచేసివెన్నెల్లో షికారుగా ఊరికి దూరంగావున్న సముద్రపు వొడ్డుకువెళ్లాం. మరిచిపోకుండా చేతిలో కర్ర ఒకటి, సిగరెట్టు పెట్టెలూ, అగ్గిపెట్టెగూడా తీసుకుని వెళ్లాం.

దారిపొడుగునా తాటిగుబుర్లు; భూమంతా వొట్టిఇసుకపర్ర. కొంతదూరం పోయాక అక్కడక్కడ కూతలు వినిపించి చాలా భయంవేసిందిగానీ, ఓ గంట అలా తిరిగి వొద్దామనుకున్న వాళ్ళం నక్కలకు భయపడడమా అని ధైర్యంచెప్పుకుని నడిచాం. నీలివెన్నెల అందంగా అక్కడి ఇసకనేలమీదా, కన్పించే సముద్రంమీదాపరుచుకుంటోంది. అది ఎండాకాలం కావడంతో ఆ సముద్రపు చల్లగాలి ఎంతయినా హాయిగొల్పుతోంది.

వెంకటేశ్వర్రావు వేదాంతంపిచ్చి గలవాడు. ఆ చల్లగాలీ, వెన్నెల అన్నీ ఒక్కసారిగా వాణ్ణి ఆనందంలో పడేసే వరకు వాడు ''మారిపోవురా'' అని పాట ప్రారంభించాడు. నేనే అసలు బస్తీలో ఆ రికార్డుల సంగీతమంటే ప్రాణం విసిగి, సగం సన్యాసం పుచ్చుకుందామని ఇటువొచ్చాను. కాశీపోయినా శనివదలనట్టు వీడు అవేపాటలు ఇక్కడా తగుల్కున్నాడు. ఖర్మం! ఏం చెయ్యడం! పైగా వెంకటేశ్వర్రావుకి ఏ పాటా సొంతంరాదు చచ్చి. అన్ని చచ్చుపాటలూ మొదటి చరణంమాత్రం వొచ్చు. వెంకటేశ్వర్రావు ఫర్లాంగు నడిచేసరికి ఏడెనిమిది పాటల మొదటి చరణాలు ఆలాపించేశాడు. అందులో ముఖ్యం, వాడికి మరీ ఇష్టమైన ఒకవేదాంతపు పాట ' ఏనాడు మొదలిడితివో'ను మరీ గార్దభకంఠంతో ఆలాపించి నాకు సన్యాసంమీద యిష్టాన్ని మరీ ఎక్కువ చేస్తున్నాడు. వొద్దంటే వీడెక్కడ సన్యాసం పుచ్చుకుంటానంటాడోనని ఆ మాట అనలేదు నేను.

వాడి పాటల బాధనించి (ఈ మధ్య వాడు పాడకుండా వుండేపక్షాన నెలకు ఐదు రూపాయల

చెప్పున తామిస్తామని మున్సిపాలిటీవాళ్ళే వొచ్చారట. కారణం, వీడింటిచుట్టూ వున్న ఇరుగు పొరుగువారందరూ కలిసి పిటీషన్‌పెట్టడమే). నన్ను ఆక్షణాన తప్పించిన సంఘటన చాలా చిత్రమైనది. వెంకటేశ్వర్రావు '' ఏనాడు!'' అని 66వ సారి మొదలెట్టి వాడు తెరిచిననోరు తెరిచినట్టేవుంచి, నన్ను వీపు చరిచి ఆకాశంవేపు చూడమన్నాడు. అటుచూద్దునుగదా ఆకాశంమీద నారింజరంగుకాంతి వలయం వొకటి అతివేగంగా తిరుగుతూ భూమివేపు వొస్తుండడం కన్పించింది. ఆ నారింజ రంగు వలయం లోపలిభాగమంతా నీలంగా ఆకుపచ్చగా కన్పిస్తోంది.

మేము ఒక్క అడుగేనా ముందుకు వెయ్యకుండా అలాగే నిల్చుండి చూస్తున్నాం ఆకాశంవేపు. మాకు ఈ మధ్య పత్రికల్లో చదివిన ఎగిరేపళ్లాల సంగతి జ్ఞాపకవొచ్చింది. ఆ కాంతివలయం రానురాను మాకుచేరువగా భూమిమీదికే దిగుతూవుంది. ఇందాకటికన్న మరింత కాంతివంతంగా కన్పిస్తోందిప్పుడు.

వెంకటేశ్వర్రావు ''కొంపతీసి ఆ ఎగిరే పళ్ళాల్లో ఇది వొకటి కాదుకదా?'' అన్నాడు మెల్లిగా.

''అయితే కావచ్చు. నీకు భయమేమిట్రా? అది ఎగిరేపళ్ళేమే అయి ఇక్కడే మన ప్రక్కనే దిగితే నేను చాలా సంతోషిస్తాను'' అన్నాను.

నేనీమాట అన్న రెండుమూడు నిమిషాలకే ఆ కాంతి వలయం, ఏమాత్రం చడీ చప్పుడూ లేకుండా, ఆ విశాలమైనసముద్రతీరపు ఇసకమీదకు వొచ్చి వాలింది. దాని ఆ కాంతి ఇందాకమేమనుకున్నట్టుగాకాక పొడుగ్గా చేపలా వుంది. దాని కాంతికి చుట్టుప్రక్కల అంతా పట్టపగల్లే అయిపోయింది. అది చేప ఆకారపు వెలుగే నిలువుగా గిరగిర తిరగడం వల్ల కాంతి వలయంలా కన్పించింది గావును!

ఇందాకట్నించీ ఎంతో ధైర్యంతో వున్న నాకుగూడా కాళ్లు గడగడ వణకసాగాయి. వెంకటేశ్వర్రావు మలేరియా రోగిలా, ఊడిపోయిన గడియారం స్ప్రింగ్ లాగా దడదడలాడి పోతున్నాడు. అయినా మాకు ఎటు పారిపోవటానికీ తోచడం లేదు. అంత వెలుగులో ఎలా ఎక్కడికని పారిపోవడం? పైగా ఆ నారింజరంగు వెలుగూ, గాఢమైన నీలి ఛెలుగూ మమ్మల్ని అయస్కాంతంలా ఆకర్షించి ఆపేశాయ్. కదలలేక పోతున్నాం.

ఆకాంతి ఆకారం మాకెంతో దూరంలో లేనట్టు తోచింది. పదిగజాలలోనే జాజ్వల్యమానంగా వెలిగిపోతోందా ప్రదేశ మహోర్ణవంనుండి దిగిన వెలుగుపదార్థం.

మరొక్క నిమిషానికల్లా అందులోనుండి తలుపులు తెరచుకుని ముగ్గురు దివ్యవ్యక్తులు కిందికి దిగారు. ఇద్దరు పురుషుల్లాగా వున్నారు. ఒకరు స్త్రీ. ఒక్కొక్కళ్ళు తొమ్మిదేసి అడుగుల ఎత్తున్నారు. చాలా అందంగావున్నారు. వాళ్లు ధరించిన దుస్తులు స్వచ్ఛమైన తెలుపుగావుండి మెరిసిపోతున్నాయి. శరీరపురంగు అవర్ణనీయమైన లేత నారింజరంగుగా వుంది. జుట్టు నల్లగా నిగనిగలాడుతోంది. ఒంటిమీద దుస్తులు మినహాయించి మరో ఆభరణాలే లేవు వాళ్ళకు. ఆ స్త్రీకి సయితం!

వెంకటేశ్వర్రావూ, నేనూ చాలాభయపడిపోయాం. ఇక తిరిగి కొంపలకు పోవటం వుండదనే నిర్ణయించుకున్నాం. ఆ యెదురుగా వున్న వాళ్ళు ఎటువంటివాళ్లు! మమ్మల్ని బతకనిస్తారా?... ఇలా మేమొక్కసారిగా ప్రాణభీతితో కంపించి వొళ్ళంతా చమటపోసి ఉక్కిరి బిక్కిరి ఐపోతూవుంటే, ఆ

ముగ్గురు దివ్యవ్యక్తులూ మా సమీపానికే వొచ్చేశారు.

మాయెదట నిలబడ్డ ఆ బ్రహ్మాండమైన వెలుగువ్యక్తులు తమలో తామేదో ఒక స్వరంలో మాట్లాడుకొన్నారు ఒక నిమిషంపాటు. తర్వాత అందులో కొంచెం వయసు ముదిరిన వాడల్లే కనపడుతున్న వ్యక్తి మా భయాన్ని పోగొట్టే చిరునవ్వొకటి నవ్వి, ''భయపడకండి నాయనా, మేము అంగారకులం!'' అన్నాడు స్వచ్ఛమైన తెలుగులో.

నాకు కొంచెం ధైర్యం కలిగింది. ''మీరు అంగారకులా! మీకు మానవులతరఫున ఇదే మా స్వాగతం! అందుకోండి. మా మానవులకీ మధ్య ఎగిరే పళ్లాలనుగురించి అనుమానాలు ఏర్పడి వేధిస్తున్నాయి. వాటిని ఇవ్వాళటితో మీరు తీర్చెయ్యాలి'' అన్నాను ఇంకా పూర్తిగా వొణుకు తగ్గని గొంతుకతో.

''అలాగే, రండి, ఆ ఇసుకతిన్నెమీద కూర్చుని మాట్లాడుకుందాం'' అన్నాడు యువక అంగారకుడు.

నాకుకూడా కూర్చొని మాట్లాడ్డమే శ్రేష్ఠమనిపించింది. మనకంటె నాలుగడుగులు ఎత్తుగా వున్న వాళ్ళతో మెడ పైకెత్తి ఎంతసేపని నుంచుని మాట్లాడగలం? అసలే నరాల సత్తువలేని కుచేలురం!

అంతా పక్కనేవున్న ఇసకతిన్నెపై సముద్రానికి అభిముఖులమై కూర్చున్నాం ఆ వెన్నెల్లో, అంగారక విమానపు దివ్యకాంతిలో.

2

వెంకటేశ్వర్రావు అంగారకులలో ఆ అమ్మాయివైపే చూస్తూ కూర్చున్నాడు. వీడెక్కడ ఆ అమ్మాయినిచూస్తున్న తిక్కలో మళ్ళీ పాట ప్రారంభించి అంగారకుల్నీ బెదిరించేస్తాడేమో అనుకున్నాను. కాని వీడి పుణ్యాని కట్లాంటిదేమీ జరగలేదు.

''అయితే మీరు తెలుగు బాగా మాట్లాడుతున్నారే, ఇది ఎలా సంభవించిందీ?'' అని మెల్లగా సంభాషణ ప్రారంభించాను నేను, సిగరెట్టు వెలిగించి.

పెద్ద అంగారకుడు, ''భాషలు కొత్తవీ పాతవీ అని మీరు అంటే మనుష్యులు కష్టపడతారుగాని, స్వరాన్నిబట్టి భావాల్ని ఊహించి తద్వారా భాష తెలుసుకునే మాకు ఏ భాషయినా ఒక్కటే'' అన్నాడు నవ్వుతూ.

వెంకటేశ్వరరావు ''మీ లోకంలో భూమిమీదలాగానే పంటలూ అవీ పండుతాయా?'' అని ప్రశ్నించాడు.

''అన్నీ పండుతాయి. చాలా పెద్దపెద్ద వురువులలో వుంటాయి. మీ కూరగాయల్లాగా ఈసురోమంటూ వుండవు'' అన్నాడు రెండో అంగారక యువకుడు.

వెంకటేశ్వరరావు ''అయితే మీకు మీ భూమిసంగతి యిదివరకే బాగా తెలుసున్నట్టుందే!'' అని అడిగాడు. నాకూ అదే అనుమానం వేసింది.

యువక అంగారకుడు, ''మీకు అంగారకుల్నిగురించి ఏమీ తెలియదని మే మిదివరకే అనుకున్నాం. అంతే జరిగింది! ఏం అన్నయ్యా?'' అన్నాడు తనసోదర అంగారకుణ్ణిచూసి. అంగారకయువతిగూడా

నవ్వింది.

నాకు సిగ్గేసింది. మానవుడు తన అపారమైన వైజ్ఞానిక పరికరాలతో విశ్వమహార్ణవాన్నంతా గాలించి ఏమూల యేమున్నదో కనుక్కుంటున్నాడు. వెధవది పొరుగుగ్రహం అంగారకుడిలో ఏమున్నదో తెలుసుకోలేదే!....

నే నిలా ఆలోచిస్తూవుండగానే పెద్ద అంగారకుడు మొదలెట్టాడు. ''దీన్నిగురించి మీరింతగా సిగ్గుపడిపోవాల్సిన అవసరమేమీ లేదండి. నేను చెప్పేవి వింటే మీకే తెలుస్తుంది...'' ఆయన నా మనోభావం గ్రహించినట్టే అన్నాడీమాటల్ని. ''అంగారక నాగరికతంతా ప్రారంభమై ఇంకా పదివేల సంవత్సరాలు కాలేదు. అంగారకగ్రహం మనోహరమైన ఆరోగ్య ప్రకృతిసంపద కలిగి వుంటుంది. విశేషమేమంటే అంగారకుల జీవితపరిమాణం మీ కాలమానం ప్రకారం వెయ్యేండ్లు. మాకు నాగరికతనూ, విజ్ఞానాన్నీ అభివృద్ధి చేసుకోటానికి ఆయుర్దాయమూ ఉంది, తీరికా ఉంది.'' అంటూ వుండగానే వెంకటేశ్వర్రావు ''అంత ఆయుఃప్రమాణం వుండడానికి కారణం ఏమిటో?'' అని ప్రశ్నించాడు.

''అది ఒక ముఖ్యమైన ప్రశ్న. మేము ఎప్పుడూ దేన్ని గురించీ విచారించం; దుఃఖించం; నవ్వుతూ వుంటాం. మీదు మిక్కిలి మెదడును లేనిపోని కుట్ర ఆలోచనలతో గందరగోళం చెయ్యం. అందువల్ల మాకు జీవిత ప్రమాణం ఎక్కువౌతున్నది. వైజ్ఞానికులు చాలా విషయాలు కనిపెట్టారు. మా కిప్పుడు జీవితం ఆనందమయం'' అన్నాడాయన గర్వంగా.

''ఆ లెఖ్ఖకొస్తే మా సైంటిస్టులుగూడా చాలా విషయాలు కనిపెట్టారు లెండి. మీకు రేడియోలున్నాయా?'' అని అడిగాడు వెంకటేశ్వర్రావు.

అంగారకులు గొల్లున నవ్వారు. ''మానవుల రేడియోలు భూమివరకే పరిమితం; వారి ప్రసారాలు వారికే వినిపిస్తాయి. అంగారకులం మా శబ్దగ్రహణయంత్రాలద్వారా భూమినుండి వినిపించే అన్ని రేడియోప్రసారాల్ని వింటూ వుంటాం. మీ భూమి చరిత్ర యావత్తూ ఎప్పటికప్పుడు మాకు తెలుస్తూనే వున్నది.'' అన్నాడాయన.

''కొంపతీశారే! మీలోకంలోగూడా వున్నాయా రేడియోలు!'' అన్నానేను సంగీతమంటే వున్న భయంకొద్దీ.

''అంత భయం అక్కరలేదు. అంగారక గ్రహంలో ' ఆనందం' కాని దేదీలేదు. అక్కడ కొచ్చేస్తే ప్రతిదీ ఆనందమే అనిపిస్తుంది మీకున్నూ'' అన్నాడు అంగారకుడు. పైగా ''భూమి వాసులకు ఆనందం అంటే బాధా నివారణే!'' అని గూడా అన్నాడు. నవ్వాడు మానవజాతి మొహాన్నే! ఎంత నిజం చెప్పాడు అనిపించిందినాకు.

''మీ గ్రహంలోని ఆర్థికవ్యవస్థ ఎట్లాంటిది? మీ రాజకీయాలు ఎలావుంటాయి?'' అని అడిగాడు వెంకటేశ్వర్రావు. అతనికెప్పుడూ ఆర్థికగొడవలే.

అంగాకరకులు నవ్వారు. ''మేమూ చూస్తున్నాము వెయ్యేండ్లనుంచి మా దూరదర్శిని యంత్రాలనుంచి. భూమ్మీద మానవులు ఆర్థిక బాధలనుంచి బయటపడ్డానికి యుద్ధాలు చేసి, రాజకీయ వ్యవస్థలు మార్చుకునీ నానా అవస్థలూ పడుతున్నారు. మీరింకా ఏం పురోగమిస్తారు? మాకు ఎలాంటి రాజకీయ వ్యవస్థకూడా ఏనాడూ లేదు; ఆర్థిక బాధలనేవి అసలే లేవు. లోహపు బిళ్ళలకోసం,

లోహపుముద్దకోసం, యుద్ధాలు చేసుకోటం అంగారకగ్రహవాసులు ఎరుగరు; అసలు ఇంకొకణ్ణి బాధించటమే ఎరగం మేము. ఇంకో చిత్రమైన వ్యత్యాసం వుంది అంగారకులకూ, మీకూ. మీరు ఎల్లప్పుడూ ఎవరో ఒకరు పరిపాలిస్తేనేగాని వుండలేని మనస్తత్వానికి అలవాటుపడిపోయారు - రాజులో, శాసనసభ్యులో - నియంతలో - ఎవరో ఒకరు! మీరీ రోజున శాసనాలు చేసుకుంటున్నారంటే వాటిని అమలుజరపటానికి పోలీసులూ, న్యాయస్థానాలూ వుండాలి. నిన్నటిధర్మం నేడు అధర్మం అయిపోతోంది మీకు. మీరు చేసే ప్రతి శాసనాన్నీ ఎవరో కొందరు ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తూనే వుంటారు. నిజానికి మానవులు ప్రకృతి ధర్మాలకే కట్టుబడక వ్యతిరేకించి నాశనమైపోతున్నారని మా విశ్వాసం!'' అన్నాడు పెద్ద అంగారకుడు దృఢంగా.

''అయితే మీ పద్ధతులేమిటి? వాటి విశిష్టత ఏమిటి?'' అని అడిగినాను నేను. మానవుడు వేల సంవత్సరాలుగా నిర్మించిన నాగరికతనంతా ఈ అంగారకులు నిముషంలో ఎగతాళి చేసి పారేశారే! అనిపించింది నాకు. ''మాకు ఏ రాజకీయ వ్యవస్థ గానీ లేకపోవటమే మా విశిష్టత. నూరుకోట్లమంది అంగారకులం వున్నాం. అంతా సరిసమానంగా ఏకకుటుంబంలాగా అంగారక గ్రహంలో ప్రకృతిసంపదను ప్రకృతి సిద్ధంగా నే వాడుకుంటూ వుంటాం. మీ మానవభాషల్లోవున్న ద్వేషం - భయం - అసూయ, అహంకారం లాంటి శబ్దాలు అంగారక భాషలో లేనేలేవు. మమ్మల్ని ఎవరూ పరిపాలించనక్కరలేదు. శాసనాలు అక్కరలేదు'' అన్నాడు అంగారకుడు.

''మీ వైజ్ఞానిక పరిశోధనలు ఈనాడు ఏ దశలో వున్నాయి?'' అని అడిగాను నేను.

''అవా? మా కాంతివేగంతో నడిచే విమానాలు ఈనాడు ప్రదేశమహార్ణవాన్నంతా తిరిగివస్తున్నాయి. మీ వైజ్ఞానికులు పదార్థపు టణువులను విచ్ఛిన్నం చెయ్యడాన్ని ఇప్పుడే కనిపెట్టారు కదూ? మేము, పదార్థంనించి కాంతిని విడదీసి దాన్ని నిలవచేసుకుని అనేకమైన పరికరాలను చేసుకుంటున్నాం. ఏ పరికరాలూ అవసరం లేకుండా సినిమాలు నడుపుకుంటాం. ఐదారువందల ఏండ్లక్రితం, మా దుస్తుల్ని బంగారంతో, వెండితో, గాజుతో తయారు చేసుకునేవారం. ఇప్పుడు సూర్యకాంతినీ, చంద్రకాంతినీ వాడుకుంటున్నాం'' అని తన వొంటిమీది చొక్కాను చూపించాడు.

వెంకటేశ్వర్రావూ, నేనూ ఆ చొక్కాల్ని పట్టుకొని చూశాం. బరువులేవు; ఏ మాత్రం బరువూ లేవు... కాంతికి బరువేం వుంటుంది?

''మీరు ముగ్గురూ వేసిన దుస్తులు వేరు వేరుగా వున్నాయే?'' అని అడిగాడు వెంకటేశ్వర్రావు. అంగారక యువతి. ''అవును. అంగారక స్త్రీలు ఎక్కువగా వెన్నెలతోటి తమదుస్తుల్ని తయారుచేసుకుంటారు. పురుషులు, సూర్యకాంతినో, నక్షత్రకాంతినో ఉపయోగించుతారు. ఇవి చిరగవు; మాయవు. ఎన్నటికీ మెరుగు తగ్గని కాంతితో నిగనిగ లాడతాయి'' అన్నది.

నాకూ, వెంకటేశ్వర్రావుకీ ఇలాంటివి మనకుంటే ఎంత బాగుణ్ణో అనిపించింది. కాని ఎలా దొరుకుతాయి అవి? నూలుగుడ్డలకే చస్తూవుంటే!

''చాలా చిత్రంగా వున్నాయి మీ వ్యవహారాలు! సరేగాని, ఏమండీ, మీకు, మృత్యువు ఎలా'' అని ఏదో అడగబోయి సగంలో మానేశాడు వెంకటేశ్వర్రావు.

యువక అంగారకుడు ''మృత్యువా? మా భాషలో దానికి పర్యాయపదం లేదు. కాని, ఆ 'చర్య'

వున్నది. అంగారకులు వెయ్యేళ్ళయినాక కాంతిలో లీనమైపోతారు. ఎవరూ ఈలోగా పోరు. మానవులలాగా అకాల మరణాలు, రోగాలతో చావడాలూ మే మెరగం. ఎందుకని? అని మీరు అడుగుతారు; దానికి కారణం మేము, దుర్గుణాలు లేకండా 'భయం' లేకండా, ద్వేషాలు లేకండా ప్రేమతో పరస్పరం నమ్మకంతో ఎల్లప్పుడూ ఆనందంగా సమిష్టిగా జీవించడమే'' అన్నాడాయన.

''భేష్! భేష్! కొందరు మంచి మానవులుగూడా ఇదే చెప్పినట్టు నాకు గుర్తు. అసలు మీకు ఆధ్యాత్మికంగురించి ఏమైనా అభిప్రాయం వుందా?'' అని ప్రశ్నించాడు వెంకటేశ్వరరావు కుతూహలంగా.

''మాకు ఆనందమే - ఆధ్యాత్మికానికి పర్యాయపదం'' అన్నాడు అంగారకవృద్ధుడు.

''అయితే దేవుడు?'' అన్నాడు వెంకటేశ్వరరావు దిగులుగా.

''అంగారకుల యిళ్ళన్నీ దైవమందిరాలే. ప్రేమ, ఆనందాలే దైవమంతా అని మా విశ్వాసం, దేవుడు అని ప్రత్యేకం ఏమీ లేదు'' అన్నాడాయన. తర్వాత వాళ్ళు ముగ్గురూ చప్పున లేచి. ''మేమికవెళతాం'' అన్నారు. మాట అన్నారంటే బ్రతిమాలినా వుండేటట్టులేరని తోచింది నాకు. అయినా మర్యాదకదా అని, '' ఇంకా కాసేపు వుండండి. లేదా మాతో గూడా రారాదూ? రేపో యెప్పుడో వెళ్ళొచ్చు!'' అన్నాను. వెంకటేశ్వర్రావూ యిదే అన్నాడు.

''లేదు వెళతాం. మానవుల్లోకి వొచ్చి మేము మెలిగే అంత సంస్కారం యింకా మీకు కలగలేదు. దొంగ మర్యాదలూ, అబద్ధాలూ మానితేగాని యితర గ్రహవాసులలో మానవులమీద విశ్వాసం ఏర్పడదు'' అన్నాడు అంగారక యువకుడు.

తలలు వొంచుకున్నాం మేము. వెంకటేశ్వర్రావు ''అయితే మీరు మానవులకిచ్చే సందేశమేమిటి?'' అని అడిగాడు.

'' ఏముంటుంది? మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. 'నాది' అన్న వ్యక్తిభావం, దాచుకోడం అన్న దుర్గుణం పోయి, ప్రేమ - సాంఘిక సమిష్టిభావం అలవర్చుకోండి'' అంటూనే వాళ్లు, చేతులు వూపుతూ తమ వెలుగు విమానం యెక్కి త్రుటిలో గగనపథంలోకెగిరిపోయారు. ఆ యెగిరేపళ్ళెం కాంతి వేగంతోటి మరో త్రుటికాలంలో నక్షత్రాల్లో నక్షత్రంలా ఎగసి కలిసిపోయింది.

మేమిద్దరం ఊళ్ళోకి బయిల్దేరాం. వెంకటేశ్వర్రావు ''అంగారకుల జీవనవిధానం వింటే, మనబుద్ధుడూ, ఏసుక్రీస్తూ చెప్పిన సూక్తుల ననుసరించే వున్నాయి!'' అన్నాడు నాలుక చప్పరించి.

''అవును, ఏం ప్రయోజనం? మానవుల్లో మహత్తరులైన ఆ దైవజ్ఞులు చెప్పినమాటల్ని చెవిని బెట్టని ఈ జాతి, అంగారకులు చెబితే వింటుందా? నాకు నమ్మకం లేదు'' అన్నాను, నడుస్తో.

తాటిగుబుర్ల చీకట్లోకి జొరబడుతూ నక్కకూతకు జంకుతూ చేతిలోకర్ర తిప్పుతూ వెంకటేశ్వర్రావు ''మానవ జాతిచరిత్ర పరస్పర అవిశ్వాసాలతో ప్రారంభమై నడుస్తోంది'' అన్నాడు.

''నిజమే'' అన్నాను నేను.

(*కథావాహిని 1955*)